క్లుప్తంగా

దక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు


విశేషాలంకరణలో స్వామివారు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురుదక్షిణామూర్తికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష అభిషేకం జరిపించారు. సుందరంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

నేటి నుంచి పవిత్రోత్సవాలు

నారాయణవనం: సముదాయంలోని టీటీడీ అనుబంధ ఆలయమైన అగస్తీశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారి నాగరాజు తెలిపారు. ఉత్సవాలు, ఊరేగింపుల్లో సంభవించిన అపచార దోషాల నివృత్తికి పవిత్రోత్సవాలను నిర్వహిస్తామన్నారు. శుక్రవారం సాయంత్రం గణపతి, వాస్తు పూజలు, శనివారం నిర్మిత యాగశాలలో వాస్తు, నవగ్రహ శాంతి హోమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చివరి రోజైన ఆదివారం ఉదయం మూలవర్లకు, ఉత్సవర్లకు, పరివార దేవతలకు పవిత్ర సమర్పణ, సాయంత్రం సముదాయం వీధుల్లో నంది వాహన సేవ జరుగుతుందని ఆయన తెలిపారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్ మృతి


బాలకృష్ణ (ఫైల్)

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పురపాలక సంఘం శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ గురువారం ఉదయం ఆకస్మికంగా మృతి చెందారు. బుధవారం విధులు నిర్వహించుకుని స్వగ్రామం చంద్రగిరికి వెళ్లారు. గురువారం ఉదయం స్పృహ కోల్పోవడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు.

నవ సంధి వినాయకులకు ముక్కంటి సారె


సారెను తీసుకెళుతున్న ఈఓ బాపిరెడ్డి తదితరులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా మాడవీధుల్లో వెలసిన నవసంధి వినాయకులకు బుధవారం ఈఓ బాపిరెడ్డి ఆధ్వర్యంలో ముక్కంటి సారె సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలోని అలంకార మండపంలో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ సారెను ఊరేగింపుగా తీసుకెళ్లి వినాయకులకు సమర్పించారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన


పనులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్

ఏర్పేడు: ఏర్పేడు మండలం బండారుపల్లి పంచాయతీలో జరుగుతున్న నీటి సేకరణ పనులను జిల్లా డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ గురువారం తనిఖీ చేశారు. పని వద్ద కూలీలకు వేతనం రూ.307 వచ్చేలాగా పని చేయించాలని సూచించారు . పనికి వచ్చిన ప్రతి కుటుంబం 100 రోజులు పని పూర్తిచేయాలని ఏపీఓ సుజాతకు సూచించారు.

డీఎస్సీ సోషియల్‌లో యాగవేంద్రకు 8వ ర్యాంకు



రేణిగుంట: చంద్రగిరి మండలం దోర్నకంబాలకు చెందిన మిట్టూరు రాజగోపాల్ రెడ్డి కుమారుడు యాగవేంద్ర డీఎస్సీ స్కూల్ అసిస్టెంట్ సోషియల్ లో 80.9 మార్కులతో జిల్లా స్థాయి 8వ ర్యాంకు సాధించారు. గురువారం చిత్తూరులో నిర్వహించిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరయ్యారు.


శ్రీకాళహస్తి: ముత్యాలమ్మగుడివీధిలో మిథున గణపతి


పెండ్లిమండపం వద్ద..


కైకాల మండపంలో..


సముదాయంలో మూషిక వాహనంపై శక్తి వినాయకుడు

గణేశం.. సర్వేశం


నారాయణవనంలో..


వరదయ్యపాళెంలోని విజ్ఞాన్‌నగర్‌లో..




పార్టీ కార్యాలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, భక్తులకు అన్నదానం చేస్తున్న మధుసూదన్‌రెడ్డి, రేణిగుంట: పసాదం స్వీకరిస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

- భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలు
- వాడవాడలా కొలువుదీరిన గణపతి ప్రతిమలు
- పలుచోట్ల ఘనంగా నిమజ్జనోత్సవాలు
- సత్యవేడు నియోజకవర్గవ్యాప్తంగా ఘనంగా చవితి వేడుకలు

ఆదిదేవా శిరసాస్మరామి.. మూషిక వాహనా సదా నమామి.. పార్వతీ తనయా ప్రణామి.. అంటూ వినాయక చవితి పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో బుధవారం జరుపుకున్నారు. వాడవాడలా కొలువుదీరిన గణపతి ప్రతిమలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంటింటా మట్టి గణనాథుని విగ్రహాలను ప్రతిష్ఠించుకున్నారు. విశేష పత్రితో స్వామిని అర్చించారు. పిండి వంటలను నైవేద్యంగా సమర్పించారు. విద్యాబుద్ధులు ప్రసాదించాలని పిల్లలు ప్రార్థించారు. ఈ క్రమంలోనే గురువారం పలు ప్రాంతాల్లో పూజలందుకున్న విఘ్నేశ్వరుని ఊరేగింపుగా తీసుకెళ్లి పవిత్రజలాల్లో నిమజ్జనం చేశారు.

శ్రీకాళహస్తి: వైఎస్సార్‌సీపీ పట్టణ కార్యాలయంలో ఘనంగా వినాయక చవితి పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని స్వామివారిని ప్రార్థించినట్లు వెల్లడించారు. అనంతరం పట్టణంలోని పలు ప్రాంతాల్లో కొలువుదీరిన గణనాథునికి చేపట్టిన పూజలకు హాజరయ్యారు. అలాగే భక్తులకు అన్నదానం చేపట్టారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, నేతలు కంతా ఉదయ్‌కుమార్ శ్రీవారి సురేష్, పఠాన్ ఫరీద్, బుల్లెట్ జయశ్యామ్, మున్నా రాయల్, శరవణ పాల్గొన్నారు.

ఫ్లెక్సీలపై ఆందోళన

శ్రీకాళహస్తి పట్టణంలో వినాయక విగ్రహాల కంటే కూటమి నేతల ఫ్లెక్సీలు ఎక్కువయ్యాయని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి విమర్శించారు.మాడవీధుల్లో ఫ్లెక్సీలు పెట్టరాదని నిబంధన ఉన్నప్పటికీ కూటమి నేతలు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ నేతలు ఒక్క ఫ్లెక్సీ పెట్టేదానికి కూడా అధికారులు అనుమతి ఇవ్వడం లేదని మండిపడ్డారు. కూటమి నేతల ఫ్లెక్సీలను కన్నెత్తి చూసేందుకు కూడా భయపడుతున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తమ ఎమ్మెల్యేను విచ్చలవిడిగా ప్రజలపై వదిలేశారని ఆరోపించారు.

చవితి ఉత్సవాల్లో ఎమ్మెల్సీ సిపాయి

రేణిగుంట: పట్టణంలో నిర్వహించిన వినాయక చవితి వేడుకల్లో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం పాల్గొన్నారు. నిర్వాహకులు వీఎస్ ధర్మరాజులు, శ్రీనివాసులు స్వాగతం పలికారు. అనంతరం రైల్వే స్టేషన్ ఎదుట అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రేణిగుంటలో వినాయక చవితిని ఘనంగా నిర్వహిస్తున్నారని ప్రశంసించారు.


తొట్టంబేడులో నిమజ్జనానికి తరలివెళుతున్న గణపతి

వరదయ్యపాళెం: మండలవ్యాప్తంగా వినాయక చవితి ఉత్సవాలు అంబరాన్నంటాయి. 29 గ్రామ పంచాయతీల్లో పెద్దఎత్తున బుధవారం వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. గ్రామాల్లో సంబరాలు అంబరాన్నంటాయి. గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. త్రయంబకేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, వరదయ్యపాళెం గ్రామ పురవీధుల్లో స్వామివారి ఉత్సవ మూర్తిని ఊరేగింపుగా తీసుకెళ్లారు. శుక్రవారం సాయంత్రం పలుచోట్ల నిమజ్జనోత్సవాలకు సిద్ధం చేస్తున్నారు.

నారాయణవనంలో..

నారాయణవనం: సముదాయంలోని టీటీడీ అనుబంధ శక్తి వినాయక స్వామి ఆలయంలో గణపతికి ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం మూషిక వాహనాన్ని అధిరోహించిన శక్తి వినాయకస్వామి సముదాయం పురవీధుల్లో విహరించారు. దూండి వినాయక స్వామి ఆలయంలో ఉదయం అభిషేకాలు, అన్న ప్రసాద వితరణ చేపట్టారు. నగరు వీధిలో వర్తక సంఘం ఏర్పాటు చేసిన ఏడు గణనాథులను సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం దర్శించుకున్నారు.

నాగలాపురం పోలీస్ స్టేషన్‌లో ..

నాగలాపురం: మండలంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎస్ఐ సునీల్ ఆధ్వర్యంలో వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు.

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: భక్తి శ్రద్ధలతో ఉపవాసాలు ఉండి వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. విగ్రహాల వద్ద తీర్థ, ప్రసాదాలను పంపిణీ చేశారు.


నాగలాపురంలో..


చిన్న పాండూరులో..


బుచ్చినాయుడుకండ్రిగలో..

స్మార్ట్ మీటర్లు.. విద్యుత్ చార్జీలపై నిరసన


శ్రీకాళహస్తిలో నేతల నిరసన


రేణిగుంటలో పోస్టర్ ప్రదర్శిస్తున్న నేతలు

శ్రీకాళహస్తి: బషీర్ బాగ్ కాల్పుల్లో ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాల సాక్షిగా స్మార్ట్ మీటర్లను అడ్డుకుంటామని వామపక్ష, ప్రజా సంఘాల నేతలు స్పష్టం చేశారు. గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద అంబేడ్కర్ కూడలిలో స్మార్ట్ మీటర్లు, విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ బషీర్ బాగ్ విద్యుత్ పోరాటంలో అప్పటి చంద్రబాబు ప్రభుత్వం ముగ్గురిని బలితీసుకుని 25 ఏళ్లు గడుస్తోందన్నారు. ఆ ఘటన ఫలితంగా అప్పట్లో చంద్రబాబు అధికారం కోల్పోయారని గుర్తు చేశారు. ప్రపంచ బ్యాంకు, కార్పొరేట్ విధానాలకు అనుకూలంగా అప్పట్లో చంద్రబాబు పాలన కొనసాగించారని మండిపడ్డారు. ఇప్పుడు అదే పంథాను కొనసాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి స్మార్ట్ మీటర్ల నిర్ణయం ఉపసంహరించుకుని, అదనపు విద్యుత్ చార్జీలను తగ్గించకుంటే ఉద్యమం తప్పదన్నారు. సీపీఐ ప్రాంతీయ కార్యదర్శి జనమాల గురవయ్య, సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి, పెనగడం గురవయ్య సంక్రాంతి వెంకటయ్య, వెంకటేష్, అన్వర్ బాషా, లాల్ బాషా, గోపి, మించిల శివ కుమార్ పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళి

రేణిగుంట: బషీర్‌బాగ్ ఘటనలో ప్రాణాలర్పించిన అమరవీరులకు సీపీఎం కార్యాలయంలో గురువారం వామపక్ష నేతలు నివాళులర్పించారు. అనంతరం పోస్టర్ ప్రదర్శించారు. కార్యక్రమంలో నేతలు ఓ.వెంకటరమణ, ఈశ్వరమ్మ, దిలీప్‌బాషా, చీరాలయ్య, భారతి, మురళి, భాను, సెల్వ పాల్గొన్నారు.

1 నుంచి హరికథ కళాకారులకు శిక్షణ

తిరుపతి అన్నమయ్యసర్కిల్: హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు 160వ జయంతిని ఈ నెల 31వ తేదీన మహతి కళాక్షేత్రంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు గురువారం టీటీడీ ఓ ప్రకటన విడుదల చేసింది. సెప్టెంబరు 1 నుంచి 10వ తేదీ వరకు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో 180 మంది హరికథ కళాకారులకు హరికథ వైభవం పేరిట శ్వేత భవనంలో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొంది. కళాకారులకు ఉచిత భోజనం, వసతి కల్పించనున్నట్లు వెల్లడించింది.

ఘనంగా ఉత్కల ఉత్సవం

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీలో గురువారం నువకాయ్ ఉత్కల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గ్లోబల్ లా ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపల్ డాక్టర్ విజయ కుమార్ బెహరా విచ్చేశారు. వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ భారతీయ సంస్కృతిని సంరక్షించడమే వర్సిటీ లక్ష్యమని తెలిపారు.అకడమిక్ డీన్ ప్రొఫెసర్ రజనీకాంత్ శుక్లా, రిజిస్ట్రార్ కడియం వెంకట నారాయణరావు, ప్రొఫెసర్ రంగనాథన్, ఫైనాన్స్ ఆఫీసర్ రాధా గోవింద త్రిపాఠి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అతిథులు

బీసీ బాలుర హాస్టల్ తనిఖీ


విద్యార్థులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ

రేణిగుంట: తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని బీసీ బాలుర హాస్టల్‌ను గురువారం ఇన్‌చార్జి ఎంపీడీఓ ప్రభురావు తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. వ్యక్తిగత శుభ్రత,ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పించారు. మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని సిబ్బందిని ఆదేశించారు. హాస్టల్ ప్రాంగణంలో పరిసరాలను పారిశుద్ధ్య సిబ్బందితో పరిశుభ్రం చేయించారు. ఎంపీడీవో మాట్లాడుతూ హాస్టల్ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు.

తడి-పొడి చెత్తపై అవగాహన


మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరత్నమ్మ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో తడి-పొడి చెత్తపై మహిళా సమాఖ్య సభ్యులకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ వెంకటరత్నమ్మ తెలిపారు. ఆమె గురువారం ఈఓపీఆర్‌డీ చిరంజీవి, ఏపీయం మునెయ్యతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ప్రజలు చెత్తను బయట పారబోయకుండా తడి, పొడి చెత్తను వేరు చేసి డస్ట్‌బిన్‌లలో వేసేలా, పారిశుద్ధ్య కార్మికులు మీ ఇంటి వద్దకు వచ్చినప్పుడు అందించేలా మహిళ సమాఖ్య సభ్యులకు తెలియజేయాలని తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులు గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించి, ఎరువుగా మార్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండల మహిళా సమాఖ్య సభ్యులను టీమ్‌లుగా ఏర్పాటు చేసి, గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐకేపీ కార్యాలయ అకౌంటెంట్ గిరిజ, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు స్పందన

సత్యవేడు: మండలంలోని దాసుకుప్పం ఆరోగ్య కేంద్రంలో గురువారం టీటీడీకి చెందిన శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన సంస్థ (స్విమ్స్) ఆధ్వర్యంలో ఉచిత మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం నిర్వహించారు. దాసుకుప్పం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ హర్షవర్ధన్ పర్యవేక్షణలో స్విమ్స్ డైరెక్టర్, వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్వీ కుమార్, డాక్టర్ కే.నాగరాజు, నోడల్ ఆఫీసర్ ప్రత్యూష, ఎం.లలిత్ వైద్య బృందం సేవలు అందించారు. పింక్ బస్సులో మహిళలకు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ మమోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణకు పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హరిత, పీఆర్ఓ చంద్ర మోహన్, సర్పంచ్ రవిరెడ్డి, సూపర్‌వైజర్ ఎం. మురళి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సంస్కరణల ముసుగులో దగా


బషీరాబాద్ మృతుల చిత్ర పటాలతో కార్మిక సంఘం నాయకులు

నారాయణవనం: రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల నెపంతో ప్రజలను దగా చేస్తోందని సీపీఎం నాయకుడు మునిశంకర్ ఆరోపించారు. రెండు దశాబ్దాల క్రితం విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా, విద్యుత్ ప్రైవేటీకరణకు తీసుకువస్తున్న సంస్కరణలకు వ్యతిరేకంగా హైదరాబాద్‌లో చేపట్టిన ర్యాలీపై బషీరాబాద్ వద్ద పోలీసుల కాల్పుల్లో అమరులైన రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వాము లను గుర్తు చేసుకున్నారు. మునిశంకర్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు విద్యుత్ ప్రైవేటీకరణకు ప్రపంచ బ్యాంకు ఆంక్షలకు లోబడి విద్యుత్ భారాలు ప్రజలపై వేసేందుకు పూనుకుంటున్నారని ఆరోపించారు. బషీరాబాద్ మృతుల పోరాట స్ఫూర్తితో నేడు పెరుగుతున్న, పెంచుతున్న విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్లను రద్దు చేసే వరకు ఉద్యమించాలని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

కంప్యూటర్ల వితరణ

- రూ.7.50 లక్షల విలువజేసే కంప్యూటర్లను అందజేసిన ఐమాప్ పరిశ్రమ
- పిల్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ల్యాబ్‌ను ప్రారంభించిన ప్రతినిధులు




పుత్తూరు పిల్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్, శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఐమాప్ పరిశ్రమ ప్రతినిధులు

శ్రీసిటీ (వరదయ్యపాళెం): శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో స్థానిక ఐమాప్ పరిశ్రమ తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో భాగంగా పుత్తూరు మండలంలోని పిల్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు రూ.7.5 లక్షలు విలువచేసే 15 కంప్యూటర్లు వితరణ చేసింది. గురువారం కళాశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఐమాప్ మేనేజింగ్ డైరెక్టర్ టయుజో ఇవామీ ఆధునికీకరించిన కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించి, కంప్యూటర్లను కళాశాల ప్రిన్సిపల్ కుమార్‌కు అందజేశారు. ఐమాప్ సీఎఫ్ఓ హరిహరన్, హెచ్ఆర్ మేనేజర్లు రాజీవ్, సుప్రియ, శ్రీసిటీ ఫౌండేషన్ ప్రతినిధి సురేంద్ర కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇవామీ మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యాసంస్థల మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి ఐమాప్ మరిన్ని కార్యక్రమాలు చేపడుతుందన్నారు. కంప్యూటర్లు వితరణ పట్ల కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపక బృందం, విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. ఐమాప్ యాజమాన్యానికి, శ్రీసిటీ ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నూతన సదుపాయం కళాశాలలోని సివిల్, మెకానికల్ విభాగంలో 300 మంది విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కాగా గడిచిన ఐదు సంవత్సరాలలో పలు ప్రభుత్వ విద్యాసంస్థల్లో వసతుల కల్పనకు ఐమాప్ సంస్థ తమ సీఎస్సార్ నిధులలో సుమారు రూ.1.80 కోట్లు ఖర్చు చేసింది. ఇది కాకుండా, శ్రీసిటీ ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ (ఐలా)కు అంబులెన్స్ వితరణ, తిరుపతిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్టీల్ టెస్టింగ్ కోసం యూనివర్సల్ టెస్టింగ్ మెషిన్, మూడు డిజిటల్ క్లాస్‌రూమ్‌ల ఏర్పాటు, జిల్లా అగ్నిమాపక శాఖలో వనరుల పెంపునకు నిధుల సాయం వంటి కార్యక్రమాలు చేపట్టింది.